కరుణ మంతెనకు ఇన్ఫోసిస్ పురస్కారం

సిటీబ్యూరో, జనవరి 13 (నమస్తే తెలంగాణ): సోషల్ సైన్సెస్ రంగంలో చేసిన కృషికి గాను హైదరాబాద్‌కు చెందిన కరుణ మంతెనకు ఇన్ఫోసిస్-2023 పురస్కారాన్ని శనివారం బెంగళూరులో జరిగిన కార్యక్రమంలో అందజేసింది. ఇన్ఫోసిస్ సైన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గత 15 ఏళ్లుగా ఇన్ఫోసిస్ ప్రైజ్ మిడ్ కెరీర్ పరిశోధకులకు వివిధ విభాగాల్లో వారి ప్రభావవంతమైన పనిని గుర్తించి అవార్డులను అందజేస్తున్నారు. సోషల్ సైన్స్‌లో ఈసారి ఇన్ఫోసిస్ ప్రైజ్-2023ని కొలంబియా యూనివర్సిటీ రాజనీతి శాస్త్రం ప్రొఫెసర్ కరుణ మంతెనకు అందజేశారు. సామ్రాజ్య పాలన సిద్ధాంతంపై ఆమె చేసిన సంచలనాత్మక పరిశోధనకు, ఆధునిక సామాజిక సిద్ధాంత ఆవిర్భావానికి ముఖ్యమైన కారకాల్లో ఒకటిగా నిలిచిందనే వాదనకు ఈ ప్రైజ్‌ను అందజేశారు.

ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు

సిటీబ్యూరో, జనవరి 13 (నమస్తే తెలంగాణ): ప్రజలకు నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. భోగి భోగభాగ్యాలతో, సంక్రాంతి సిరిసంపదలతో, కనుమను కనువిందుగా జరుపుకోవాలని కోరుకుంటూ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సంక్రాంతి ప్రజల జీవితంలో కొత్త వెలుగులు నింపాలని మనసారా ఆ భగవంతుడిని కోరుకుంటున్నానని పేర్కొన్నారు. ప్రతిఒక్కరూ ఆనందోత్సాహాలతో, రంగురంగుల ముగ్గులతో సంబురాలు జరుపుకోవాలని కోరారు.

దీర్ఘకాలిక లీజుకు మెట్రో మాల్స్

ఒప్పందానికి సిద్ధమైన నెక్సస్ మాల్ ట్రస్ట్

- లీజు ఒప్పందం విలువ రూ.2500 కోట్లపైనే..
- 3 మాల్స్‌లోని 9 లక్షల చదరపు అడుగులు లీజుకు ఇవ్వనున్న ఎల్‌అండ్‌టీ మెట్రో

సిటీబ్యూరో, జనవరి 13 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ మెట్రో రైలు ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన రవాణా ఆధారిత అభివృద్ధి కేంద్రాలు (మెట్రోమాల్స్) దీర్ఘ కాలిక లీజుకు ఇచ్చేందుకు ఎల్ అండ్ టీ సంస్థ ప్రైవేటు సంస్థలతో సంప్రదింపులు మొదలు పెట్టింది. నగరంలో మూడు చోట్ల ఉన్న మాల్స్‌ను లీజుకు ఇవ్వడం ద్వారా ఒకేసారి రూ.2500 నుంచి 3వేల కోట్ల వరకు ఆదాయం వచ్చే అవకాశం ఉంది.మొదటి దశ మెట్రో రైలు ప్రాజెక్టులో 69 కి.మీ మార్గాన్ని 3 కారిడార్‌లలో నిర్మించింది ఎల్ అండ్ టీ సంస్థ. అదే సమయంలో కారిడార్-1(మియాపూర్-ఎల్‌బీనగర్)లో పంజాగుట్ట, ఎర్రమంజిల్, మూసారంబాగ్ ప్రాంతాల్లో 3 మెట్రో మాల్స్‌ను నిర్మించగా, కారిడార్-3 (నాగోల్-రాయదుర్గం)లో హైటెక్ సిటీ వద్ద ఒక మాల్‌ను నిర్మించింది. మొత్తం 4 మాల్స్ ఉండగా, వాటి మొత్తం విస్తీర్ణం 12 లక్షల చదరపు అడుగుల వరకు ఉంది. ఇప్పటి వరకు ఎల్ అండ్ టీ మెట్రో సంస్థ హైదరాబాద్ నెక్స్ట్ గలేరియా మాల్స్ పేరుతో నిర్వహిస్తోంది. తాజాగా 3 మెట్రో మాల్స్‌ను దీర్ఘ కాలిక లీజు కింద అప్పగించేందుకు నెక్సస్ సెలెక్ట్ ట్రస్టుతో సంప్రదింపులు జరుపుతోంది. 3 చోట్ల ఉన్న మెట్రో మాల్స్ విస్తీర్ణం మొత్తం సుమారు 9 లక్షల చదరపు అడుగులు ఉండగా, పంజాగుట్ట మాల్ విస్తీర్ణం 5 లక్షల చదరపు అడుగులు, హైటెక్ సిటీలోని ఇ-గెలిరియా మాల్ విస్తీర్ణం 2 లక్షలు, ఎర్రమంజిల్‌లోని ప్రీమియా మాల్ విస్తీర్ణం మరో 2 లక్షల వరకు ఉంటుంది. వీటిలో ఇప్పటి వరకు 84 శాతం స్థలాన్ని వివిధ సంస్థలకు లీజుకు ఇవ్వడం ద్వారా ఆదాయం పొందుతోంది. కాగా అన్ని మాల్స్‌ను ఒకేసారి దీర్ఘ కాలిక లీజుకు ఇవ్వడం ద్వారా పెద్ద మొత్తంలో నిధులను సమకూర్చుకునేందుకు ఎల్ అండ్ టీ సిద్ధమైనట్లు తెలిసింది. కాగా దీనిపై హైదరాబాద్ మెట్రో అధికారులు, ఎల్ అండ్ టీ మెట్రో అధికారులు మాత్రం స్పందించలేదు.

రాయదుర్గంలో మెట్రో స్థలం లీజుకు..

హైదరాబాద్ మెట్రో రైలు ప్రాజెక్టులో భాగంగా ఎల్ అండ్ టీ మెట్రో సంస్థకు ప్రభుత్వం రాయదుర్గంలోని మైండ్ స్పేస్ జంక్షన్ సమీపంలో 15 ఎకరాలను కేటాయించింది. అందులో ఇప్పటికే రవాణా ఆధారిత అభివృద్ధి (ట్రాన్సిట్ ఓరియెంట్ డెవలప్‌మెంట్-టీఓడీ)లో భాగంగా బిజినెస్ పార్కు టవర్ 1ను నిర్మించారు. మిగతా ఖాళీ స్థలాన్ని మొత్తంగా ఇతర సంస్థలకు గతేడాది దీర్ఘకాలిక లీజుకు ఇచ్చింది. దీని ద్వారా సుమారు రూ.1200 కోట్ల ఒకేసారి సమకూర్చుకున్నట్లు సమాచారం.

డీఎస్ఎఫ్ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

డీఎస్ఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ

కేపీహెచ్‌బీ కాలనీ, జనవరి 13 : తెలంగాణ భవన్‌లో డిప్లొమా స్టూడెంట్ ఫెడరేషన్ (డీఎస్ఎఫ్) 2024 క్యాలెండర్‌ను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ శనివారం ఆవిష్కరించారు. డీఎస్ఎఫ్ ఆధ్వర్యంలో 10 ఏండ్లుగా డిప్లొమా విద్యార్థుల సమస్యల కోసం పోరాడటం అభినందనీయమని కేటీఆర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్ఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎర్రవల్లి జగన్, ఆయా వర్సిటీల ఇన్‌చార్జిలు అభిషేక్, ప్రదీప్, శ్యాం, సందీప్, అఖిలసోను తదితరులున్నారు.

కృషి ఒడిశా వేదికపై ఇక్రిసాట్

సిటీబ్యూరో, జనవరి 13(నమస్తే తెలంగాణ) : ఒడిశా కేంద్రంగా సాగుతున్న అంతర్జాతీయ వ్యవసాయ సదస్సు కృషి ఒడిశా వేదికపై హైదరాబాద్ ఇక్రిసాట్ నిలిచింది. ఆ రాష్ట్రంలోని మహిళా సంఘాలకు వ్యవసాయంపై అవగాహన కల్పించడంతో పాటు, సాగు మెలకువలపై అవగాహన కల్పిస్తోంది. ఈ నేపథ్యంలో ఇక్రిసాట్ అందిస్తున్న సేవలను గుర్తిస్తూ అక్కడి ప్రభుత్వం సత్కరించింది. అగ్రిప్రెన్యూర్‌షిప్ పెంచడమే లక్ష్యంగా ఇక్రిసాట్ శిక్షణనిస్తోంది. ఈ సందర్భంగా ఇక్రిసాట్ కాఫీటేబుల్ బుక్‌ను కృషి ఒడిశా వేదికపై ఆవిష్కరించారు.

కంచె ఐలయ్యకు అవార్డు ప్రదానం

జవహర్‌నగర్, జనవరి 13: ప్రపంచ మేధావి ప్రొఫెసర్ కంచె ఐలయ్య షెఫర్డ్ 'మా జాతి సూర్యుడు' అని కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య అన్నారు. కర్ణాటకలోని రాయచూర్ లల్లా తింతని బ్రిడ్జి కనకపీఠం ఆధ్వర్యంలో శనివారం ముఖ్యమంత్రి సిద్ధరామయ్య మా జాతి సూర్యుడు అవార్డును కంచె ఐలయ్యకు అందజేశారు. కంచె ఐలయ్య సమాజ శ్రేయస్సుకోసం ఎన్నో పుస్తకాలు రాసి ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చారని, కులాధిపత్య అసమాన సమాజంలో సమానత్వం తీసుకురావడంలో చేసిన కృషి వెలకట్టలేనిదని సిద్ధరామయ్య పేర్కొన్నారు.

ఎఫ్ఏఎల్ఎస్ 2024 విజయవంతం

జూబ్లీహిల్స్,జనవరి13: స్టార్ హాస్పిటల్ గ్యాస్ట్రోలజీ విభాగం నిర్వహించిన 'ఫెలోషిప్ ఇన్ అడ్వాన్స్‌డ్ ల్యాప్రోస్కోపిక్ హెపాటో-ఫ్యాంక్రియాటో-బిలియరీ సర్జరీ (ఎఫ్ఏఎల్ఎస్)-2024' ను విజయవంతంగా నిర్వహించినట్లు ప్రకటించారు. బంజారాహిల్స్‌లో జరిగిన ఈ మూడు రోజుల శిక్షణ కార్యక్రమాలు అడ్వాన్స్‌డ్ ల్యాప్రోస్కోపిక్ సర్జరీలో తమ నైపుణ్యాలు పెంచుకునేలా దోహదపడిందని గ్యాస్ట్రో ఇంటెస్టినల్ సర్జన్ డాక్టర్ భరత్ కుమార్ నారా పేర్కొన్నారు. ఈ సమావేశంలో డాక్టర్ ఆదిత్య చౌదరి, డాక్టర్ రాఘవేంద్రబాబు, 40 మంది ఫెలోషిప్ అభ్యర్థులతో పాటు ప్రతినిధులు పాల్గొన్నారు.

గ్రేటర్‌లో పెరిగిన ఉష్ణోగ్రతలు

సిటీబ్యూరో, జనవరి 13 (నమస్తే తెలంగాణ): ఆగ్నేయ దిశ నుంచి తెలంగాణ వైపునకు వీస్తున్న గాలుల ప్రభావంతో గ్రేటర్‌లో ఉష్ణోగ్రతలు పెరిగాయి. మొన్నటి వరకు సాధారణ స్థాయి కంటే తక్కువగా నమోదైన ఉష్ణోగ్రతలు ఒక్కసారిగా సాధారణ స్థాయి దాటి నమోదవుతున్నాయి. శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు నగరంలో గరిష్ఠ ఉష్ణోగ్రత సాధారణం కంటే 0.4డిగ్రీలు పెరిగి 31.4డిగ్రీల సెల్సియస్‌గా, కనిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణ స్థాయి కంటే 1.4డిగ్రీలు పెరిగి 19.4డిగ్రీల సెల్సియస్‌గా నమోదైనట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. దీని వల్ల నగరంలో పగలు, రాత్రి సమయంలో చలి తీవ్రత కొంత తగ్గిందని తెలిపారు.

స్వాధీనం చేసుకున్న వాహనాలను పరిశీలిస్తున్న రాచకొండ సీపీ సుధీర్‌బాబు

బైకులు దొంగిలిస్తున్న వ్యక్తి అరెస్ట్

23 వాహనాలు స్వాధీనం

సిటీబ్యూరో, జనవరి 13 (నమస్తే తెలంగాణ): ద్విచక్రవాహనాలను దొంగిలిస్తూ తప్పించుకు తిరుగుతున్న పాత నేరస్తుడిని ఉప్పల్ పోలీసులు అరెస్టు చేశారు. నిందితుడి వద్ద నుంచి 23 ద్విచక్రవాహనాలు, ప్రింటర్, ల్యాప్‌టాప్, నకిలీ రిజిస్ట్రేషన్ కార్డులు తదితరాలను సీజ్ చేశారు. ఈ మేరకు ఎల్బీనగర్‌లోని కమిషనర్ క్యాంపు కార్యాలయంలో రాచకొండ సీపీ సుధీర్ బాబు కేసు వివరాలను వెల్లడించారు. శనివారం తెల్లవారుజామున ఉప్పల్ పోలీసులు నాగోల్‌రోడ్, ఎస్వీఎం గ్రాండ్ వద్ద వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా.. అనుమానాస్పద స్థితిలో మోటార్‌సైకిల్‌పై అటుగా వెళ్తున్న సికింద్రాబాద్‌లోని సీతాఫల్‌మండి ప్రాంతానికి చెందిన రాయుడు చైతన్యసాయి కుమార్‌ను ఆపి తనిఖీ చేశారు. అయితే వివరాలు చెప్పడంలో తడబడటంతో అనుమానం వచ్చిన పోలీసులు చైతన్యను అదుపులోకి తీసుకొని విచారించగా మెట్రో స్టేషన్‌ల వద్ద పార్క్ చేసిన ద్విచక్రవాహనాలను దొంగిలిస్తున్నట్లు అంగీకరించాడు. దీంతో పోలీసులు నిందితుడిని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. అతడి వద్ద 23 ద్విచక్రవాహనాలతో పాటు ప్రింటర్, నకిలీ రిజిస్ట్రేషన్‌కార్డులు తదితరాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసును ఉప్పల్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

'రావి నారాయణరెడ్డి' పై పాట రాయండి

సుద్దాల అశోక్ తేజను కోరిన రానారె సంస్థ ప్రతినిధులు

సిటీబ్యూరో, జనవరి 13 (నమస్తే తెలంగాణ): జాతీయ అవార్డు గ్రహీత సుద్దాల అశోక్‌తేజను రావి నారాయణరెడ్డి సేవా సంస్థ ప్రతినిధులు శనివారం కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా రావి నారాయణరెడ్డి జీవితం విశిష్టత, విలాసవంతమైన భూస్వామ్య కుటుంబ జీవితం వదులుకొని చేసిన ప్రజా సేవను ప్రతిబింబించే విధంగా పాట రాయాలని కోరినట్లు వెల్లడించారు. ఇందుకు ఆయన సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. అశోక్‌తేజను కలిసిన వారిలో సేవా సంస్థ అధ్యక్షుడు చెరుకుపల్లి శ్రీనివాసు, సలహాదారు భువనగిరి సత్యనారాయణ, సభ్యులు విజయకుమార్, ఉదయకుమార్, రాజలింగం ఉన్నారు.

19 నుంచి ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం

సిటీబ్యూరో, జనవరి 13 (నమస్తే తెలంగాణ) : జేఎన్‌టీయూ ఆధ్వర్యంలో ఈ నెల 19, 20 తేదీల్లో రెండు రోజుల పాటు టీచింగ్ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం నిర్వహించనున్నట్లు యూనివర్సిటీ ఆంత్రప్రెన్యూర్‌షిప్, ఇన్నోవేషన్ అండ్ స్టార్టప్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఆర్ శ్రీదేవి తెలిపారు. యూనివర్సిటీలో సైబర్ సెక్యూరిటీ, బీఏపీటీ సెక్యూరిటీ, పెనెట్రేషన్ టెస్టింగ్, లీగల్ అండ్ ఎథికల్ కన్సిడరేషన్, టెస్టింగ్ మెథడాలజీ వంటి పలు అంశాలపై రెండు రోజుల పాటు టీచింగ్ డెవలప్‌మెంట్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమానికి హాజరయ్యే వారు రూ.1500 చెల్లించి, రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు కార్యక్రమం కొనసాగుతుందని తెలిపారు. ఆసక్తి ఉన్న వారు ఈ నెల 17 లోపు దరఖాస్తు చేసుకోవాలని, రిజిస్ట్రేషన్ కోసం జేఎన్‌టీయూ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

దూరవిద్య ఎంఏ పరీక్షా ఫలితాల విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ, జనవరి 13: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని వివిధ కోర్సుల పరీక్షా ఫలితాలను విడుదల చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. ఓయూ దూరవిద్యా కేంద్రమైన ప్రొఫెసర్ జి.రాంరెడ్డి సెంటర్ ఫర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ (పీజీఆర్ఆర్ సీడీఈ) ద్వారా అందించే ఎంఏ (సంస్కృతం) ఇంటర్నల్, ఎంఏ (సంస్కృతం) నాన్ ఇంటర్నల్ కోర్సుల పరీక్షల ఫలితాలను విడుదల చేశారు.

బీఎఫ్ఏ కోర్సుల పరీక్షా తేదీల ఖరారు..

ఓయూ పరిధిలోని బీఎఫ్ఏ కోర్సుల పరీక్షా తేదీలను అధికారులు ఖరారు చేశారు. బీఎఫ్ఏ ఫొటోగ్రఫీ, అప్లైడ్ ఆర్ట్స్, పెయింటింగ్ కోర్సుల మొదటి, రెండు, మూడు, ఐదు, ఏడు, తొమ్మిదో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలను ఈ నెల 22 నుంచి నిర్వహించనున్నారు. పరీక్షా తేదీల వివరాలకు ఓయూ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

శిక్షణ 100 మందికేనా..!

- నిరుద్యోగుల కోసం ఏర్పాటు చేసిన అకాడమీకి ఆదరణ అంతంత మాత్రమే
- సమర్థవంతంగా నిర్వహించలేక పోతున్న ఉస్మానియా యూనివర్సిటీ

సిటీబ్యూరో, జనవరి 13 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలోని నిరుద్యోగ యువతీయువకులకు సివిల్ సర్వీసెస్‌తో పాటు గ్రూప్-1, గ్రూప్-2 వంటి అనేక పోటీ పరీక్షలకు శిక్షణ ఇవ్వడం కోసం.. కేసీఆర్ ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన ఉచిత సివిల్ సర్వీసెస్ అకాడమీ స్ఫూర్తికి ఓయూ అధికారులు తూట్లు పొడుస్తున్నారు. ఉస్మానియా యూనివర్సిటీ వేదికగా అందుబాటులోకి తీసుకొచ్చిన సివిల్ సర్వీసెస్ ఉచిత అకాడమీ ద్వారా ఒకే సారి 1000 మందికి శిక్షణ ఇవ్వాల్సిన అధికారులు.. 100 మంది నిరుద్యోగ యువతకే పరిమితం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా అర్హులైన యువతి, యువకులందరిని ఎంపిక చేసి శిక్షణ ఇవ్వడం కోసం ఓయూలోనే ప్రత్యేక కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. అయితే ఈ ఉచిత అకాడమీని ఏర్పాటు చేసి రెండేండ్లు పూర్తయినప్పటికీ.. వంద మందికి మాత్రమే శిక్షణ ఇవ్వడానికి ఓయూ అధికారులు ముందుకు రావడంపై నిరుద్యోగులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పైగా గ్రూప్-1, గ్రూప్-2, డీఎస్సీ, కానిస్టేబుల్ వంటి పోటీ పరీక్షలకు హాజరయ్యే వారికి కూడా ఉచిత శిక్షణ ఇస్తామని గతంలో ఓయూ ఉన్నతాధికారులు యువతకు హామీ ఇచ్చారు. కాని, కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వంలో సివిల్ సర్వీసెస్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు మాత్రమే శిక్షణ ఇస్తామని నిరుద్యోగ అభ్యర్థులను ఎంపిక చేసినట్లు సివిల్ సర్వీసెస్ అకాడమీ ఇన్‌చార్జి చెబుతున్నారు. ఆ వంద మంది నిరుద్యోగ యువత కూడా ఓయూ క్యాంపస్‌లో వివిధ కోర్సులు చదువుతున్న వారై ఉండాలి అన్న ఆంక్షలు విధించారు. రాష్ట్రంలోని వివిధ యూనివర్సిటీల పరిధిలో ఉన్న యువతకు ఇక్కడ శిక్షణ ఇవ్వడం లేదని, ఈ మేరకు ఇంత వరకు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఉచిత శిక్షణకు ఎంపిక చేసిన వంద మంది నిరుద్యోగ అభ్యర్థుల వివరాలు ఓయూ అధికారిక వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్లు యూనివర్సిటీ ప్రొఫెసర్ గడ్డం నాగేశ్వర్‌రావు తెలిపారు. దీంతో నిరుద్యోగ యువత తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. ఈ విషయంలో ప్రభుత్వం జోక్యం చేసుకుని నిరుద్యోగ యువతకు పెద్ద సంఖ్యలో ఉచిత శిక్షణ ఇవ్వడానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

సంక్రాంతికి ఆరు ప్రత్యేక రైళ్ల ఏర్పాటు

సిటీబ్యూరో, జనవరి 13 (నమస్తే తెలంగాణ) : దక్షిణ మధ్య రైల్వే జోన్ ఆధ్వర్యంలో సికింద్రాబాద్-తిరుపతి, సికింద్రాబాద్-కాకినాడ, నర్సాపూర్-సికింద్రాబాద్ స్టేషన్ల మధ్య ఆరు ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేస్తూ శనివారం రైల్వే అధికారులు నిర్ణయం తీసుకున్నారు. ఈ నెల 15 నుంచి 18 వరకు ఈ రైళ్లు రాకపోకలు కొనసాగిస్తాయని అధికారులు తెలిపారు.

ఆరు రైళ్లు పునరుద్ధరణ..

కాజీపేట్-డోర్నకల్, డోర్నకల్-విజయవాడ రైల్వే స్టేషన్లలో నిలిచిపోయిన నాలుగు రైళ్లను ఈ నెల 14 నుంచి 20 వరకు పునరుద్ధరిస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. అలాగే నాందేడ్-జమ్ముతవి స్టేషన్ల మధ్య రద్దు చేసిన రెండు రైళ్లను కూడా ఈ నెల 14, 19 తేదీల్లో టైమ్ టేబుల్ ప్రకారం పునరుద్ధరిస్తామని పేర్కొన్నారు.

మర్రి చెన్నారెడ్డి ఘాట్ వద్ద నివాళులర్పిస్తున్న గవర్నర్ తమిళి సై తదితరులు

మర్రి చెన్నారెడ్డి సేవలు చిరస్మరణీయం

కవాడిగూడ, జనవరి 13 : డాక్టర్ మర్రి చెన్నారెడ్డి ప్రజలకు చేసిన సేవలు చిరస్మరణీయమని రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందర్ రాజన్ అన్నారు. శనివారం ఇందిరాపార్కులోని రాక్ గార్డెన్స్‌లో ఉమ్మడి రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ మర్రి చెన్నారెడ్డి జయంతిని మర్రి చెన్నారెడ్డి మెమోరియల్ ట్రస్ట్ అధ్యక్షుడు మర్రి రవీందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి మర్రి శశిధర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందర్ రాజన్, కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి, బీసీ కమిషన్ మాజీ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్ రావు, మాజీ ముఖ్యమంత్రి నాదేండ్ల భాస్కర్ రావు తదితరులు హాజరై మర్రి చెన్నారెడ్డి ఘాట్ వద్ద పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మర్రి చెన్నారెడ్డి కుటుంబ సభ్యులు, పలు పార్టీల నాయకులు పాల్గొన్నారు.

కేర్ ఆస్పత్రిలో అరుదైన శస్త్ర చికిత్స

అబిడ్స్, జనవరి 13 : ఎంజే మార్కెట్‌లోని కేర్ ఆస్పత్రిలో అరుదైన శస్త్ర చికిత్స నిర్వహించారు. ఓ మహిళా పేషంట్‌కు వ్యాల్యూ స్పేరింగ్ ఆరోటిక్ రూట్ రిప్లేస్‌మెంట్ సర్జరీ నిర్వహించారు. ఆస్పత్రి చీఫ్ కార్డియోథెరపీ సర్జన్ డాక్టర్ కేవీ రాజశేఖర్‌రావు ఆధ్వర్యంలో ఈ అధునాతన శస్త్ర చికిత్స చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 76 సంవత్సరాల రంగు సుబ్బమ్మకు కార్డిక్ విభాగంలో వినూత్న తరహా డేవిడ్స్ ప్రొసీసర్‌లో సర్జరీ చేశామని తెలిపారు. ఇలాంటి ఆధునిక శస్త్ర చికిత్స ద్వారా పేషంట్ త్వరితగతిన కోలుకోవడంతో పాటు ఉత్సాహంగా, ఉల్లాసంగా ఉంటారని పేర్కొన్నారు.

నాంపల్లి కేర్ దవాఖానలో అరుదైన శస్త్ర చికిత్స నిర్వహించిన అనంతరం కోలుకున్న రోగితో వైద్యులు